సాక్షి
కుమురం భీం
గురువారం । 8 । ఫిబ్రవరి । 2024

పత్తి కొనుగోళ్లు పునఃప్రారంభం

ఆసిఫాబాద్అర్బన్: పత్తి కొనుగోళ్లు పునః ప్రారంభమయ్యాయని, ఈ కొనుగోళ్లు ఈ నెల 9 వరకు కొనసాగుతాయని జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్ తెలిపారు. ఆ తర్వాత ప్రతీ సోమ, మంగళ, బుధ, గురు వారాల్లో పత్తి కొనుగోళ్లు సాగుతాయని పేర్కొన్నారు. శుక్ర, శని, ఆదివారాల్లో రైతులు పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావొద్దని సూచించారు.



నాగోబా స్మరణలో 'మెస్రం'

మర్రిచెట్టు వద్ద బసచేసిన మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. జొన్నగట్కతో సంప్రదాయ వంటలు చేసి నైవేద్యం సమర్పించారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.2 /18.4

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతాయి. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. చలి ప్రభావం పూర్తిగా తగ్గుతుంది.

న్యూస్‌రీల్

వలంటీర్ల సేవలు అమూల్యం



బ్యాడ్జి అందిస్తున్న డీఈవో అశోక్

ఆసిఫాబాద్‌రూరల్: ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని డీఈవో అశోక్ అన్నారు. ఆసిఫాబాద్ మండలం బెండారలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు బుధవారం బ్యాడ్జీలు అందించారు. డీఈవో మాట్లాడుతూ 'పిల్లల కోసం' అనే కార్యక్రమంలో భాగంగా 100 ప్రాథమిక పాఠశాలల్లో చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రతీ శనివారం డిగ్రీ కళాశాల వలంటీర్లు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. చిన్నారులకు అక్షరాలు నేర్పిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుకర్, ప్రిన్సిపాల్ కనకయ్య, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంధ్యారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్అర్బన్: సీసీఐ ద్వారా పత్తి పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు అవిడపు ప్రణయ్ కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 70 శాతం మంది రైతులు పత్తి పంటను అమ్మగా.. చాలా మంది ఇప్పుడిప్పుడే జిన్నింగ్ మిల్లులకు తరలిస్తున్నారని తెలిపారు. సిర్పూర్(టి), కౌటాల, బెజ్జూర్, పెంచికల్‌పేట్, చింతలమానెపల్లి, దహెగాం పరిసర ప్రాంత రైతులు ఆలస్యంగా విత్తనాలు విత్తుకోవడంతో పంట కూడా ఆలస్యంగా చేతికొస్తుందన్నారు. అధికారులు దీనిపై దృష్టి సారించి సీసీఐ ద్వారా పూర్తిస్థాయిలో కొనుగోళ్లు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వైరాగడే మారుతి పటేల్, నాయకులు ప్రశాంత్, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులైన మహిళలకు అవార్డులు

ఆసిఫాబాద్అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న ప్రతిభావంతులైన మహిళలు, సాంఘిక, ఆర్థిక, సాధికారత రంగాల్లో విశిష్ట సేవలందించిన మహిళలను రాష్ట్ర ప్రభుత్వం అవార్డులతో సత్కరించనున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి సావిత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళలు tgsrcw@gmail.comకు దరఖాస్తులు పంపించాలని సూచించారు. హార్డ్ కాపీలను ది కమిషనర్, డబ్ల్యూడీ, సీడబ్ల్యూడీ, ఇంటి నం.8.3.222, వెంగళ్‌రావ్ నగర్, అమీర్‌పేట్, హైదరాబాద్- 500038 అనే చిరునామాకు కూడా పంపించవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 89194 15934, 81849 04030 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కర్ర లారీలతో అవస్థలు



రోడ్డుపై నిలిచిన లారీలు

కాగజ్‌నగర్‌రూరల్: ఎస్పీఎంకు కర్ర తరలిస్తున్న లారీలతో కాగజ్‌నగర్ పట్టణవాసులకు అవస్థలు తప్పడం లేదు. పట్టణంలోని బాలభారతి పాఠశాల వద్ద బుధవారం ముడిసరుకు లారీలను రహదారి మధ్యలో నిలిపివేశారు. సాధారణంగా మిల్లులోకి ముడి సరుకు లోడ్‌తో వచ్చిన లారీలను వరుసగా పంపిస్తారు. లోడింగ్ పాయింట్ గేట్ వద్ద నుంచి లారీలను మిల్లులోకి పంపిస్తుండగా బుధవారం ఒక్కసారే ఎక్కువ లారీలు వచ్చాయి. దీంతో లోడింగ్ పాయింట్ నుంచి హనుమాన్ ఆలయం వరకు లారీలు నిలిచిపోయాయి. ఇరుకు రోడ్డు కారణంగా వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఈ మార్గం గుండా రైల్వేస్టేషన్, పోస్టాఫీస్, ఇతర కాలనీలకు రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జిల్లా కేంద్రంలోని తెలివాడలో వివరాలు సేకరిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

ఇక గృహజ్యోతి

- 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం కసరత్తు
- క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది
- రేషన్ కార్డు ప్రామాణికంగా తీసుకోవాలని ప్రాథమికంగా నిర్ణయం
- జిల్లాలో 1,35,789 గృహ విద్యుత్ కనెక్షన్లు

ఆసిఫాబాద్: కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారంటీల్లో మరో రెండు పథకాలను అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడంపై కసరత్తు చేస్తోంది. అలాగే రూ.500లకు వంట గ్యాస్ సిలిండర్ అందించేందుకు అవసరమైన వివరాలనూ సేకరిస్తోంది. ఈ రెండు పథకాల అమలుకు రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. గ్యారంటీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది డిసెంబర్ 28 నుంచి జనవరి వరకు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అభయహస్తం దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. అనంతరం దరఖాస్తుల ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తుండగా, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కు వంట గ్యాస్ అందజేత హామీలను అమలు చేయాలని తెలంగాణ మంత్రివర్గం తీర్మానించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో సంబంధిత శాఖల అధికారులు మంగళవారం నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల డాటా వెరిఫికేషన్‌ను విద్యుత్‌శాఖ అధికారులు ప్రారంభించారు.

రేషన్ కార్డే ప్రామాణికం

200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కు గ్యాస్ సిలిండర్ అందజేతకు రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. జిల్లాలో 1,39,757 ఆహార భద్రత కార్డులు ఉండగా వీటిలో 13,058 అంత్యోదయ అన్నయోజన కార్డులు, 1,26,699 ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. వీటితో పాటు జిల్లాలో 1,66,774 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, ఇందులో 1,35,789 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా 15 మండలాల్లోని 1,63,647 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం 1,08,383 దరఖాస్తులు, రూ.500కు గ్యాస్ సిలిండర్ కోసం 1,29,765 దరఖాస్తులు వచ్చాయి. మంగళవారం నుంచి విద్యుత్‌శాఖ సిబ్బంది వినియోగదారుల నుంచి వివరాల సేకరణను ప్రారంభించారు. ప్రతినెలా జిల్లాలో 1 తేదీ నుంచి 15 వరకు మొబైల్ విద్యుత్ బిల్లింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. గృహజ్యోతి పథకం ద్వారా నెలకు 200 యూనిట్లు ఉచితంగా పొందేందుకు బిల్లు చెల్లించే వ్యక్తికి ఆహార భద్రత కార్డు, ఆధార్ కార్డు, మొబైల్ లింక్ విద్యుత్ మీటర్ సర్వీస్ నంబర్‌కు అనుసంధానం చేసే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారు.

ఏడాదికి ఆరు సిలిండర్లు!

రూ.500కు గ్యాస్ సిలిండర్ కోసం డెలివరీ బాయ్ ద్వారా వివరాలు సేకరించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. కేవైసీ తరహాలో లబ్ధిదారుల వివరాలతో పాటు ఆధార్, రేషన్ కార్డు నంబర్లను తీసుకుంటారు. వారి ఆర్థిక స్థోమతను అంచనా వేసేందుకు కుటుంబ వివరాలను కూడా తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఒక కుటుంబానికి ఏడాదికి 6 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. ప్రజాపాలనలో రూ.500కు గ్యాస్ సిలిండర్ కోసం 1,29,765 దరఖాస్తులు వచ్చాయి. ఈ లెక్కన ప్రతినెలా ప్రభుత్వంపై రూ.3 కోట్ల భారం పడనుంది. రెండు గ్యారంటీలు అమలు చేయాల్సి వస్తే ఎలాంటి నిబంధనలు లేకుండా అమలు చేయాలి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలకు అమలు చేయాల్సి వస్తే భారీగా కోత విధించే అవకాశాలు ఉన్నాయి. లబ్ధిదారుడి ఆర్థిక స్థితిగతుల ఆధారంగా కూడా ఎంపిక చేసే అవకాశాలున్నట్లు సమాచారం. లబ్ధిదారుల ఎంపికపై పూర్తిస్థాయి స్పష్టత రాలేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

1,35,789 గృహ విద్యుత్ కనెక్షన్లు



జిల్లావ్యాప్తంగా 1,66,774 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటిలో 1,35,789 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతినెలా గృహ వినియోగదారులు విద్యుత్ శాఖకు రూ.4.5 కోట్ల బిల్లులు చెల్లిస్తున్నారు. సాధారణంగా 200 లోపు యూనిట్ల విద్యుత్ వాడే వినియోగదారులకు యూనిట్‌కు రూ.5.25, రూ.200యూనిట్ల పైన వాడే వారు రూ.6 చొప్పున చెల్లిస్తున్నారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే వినియోగదారులకు ప్రతినెలా సుమారు రూ.800 నుంచి రూ.1000 బిల్లు వస్తుంది. ప్రజాపాలనలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం 1,08,383 దరఖాస్తులు వచ్చాయి. ఈ లెక్కన ఉచిత విద్యుత్‌తో జిల్లాలో ప్రభుత్వంపై రూ.8కోట్ల వరకు భారం పడనుంది. ఇంటి యజమానులతోపాటు అద్దెకుంటున్న వారికి కూడా ఉచిత విద్యుత్ అమలు చేయనున్నారు. అద్దెదారుల ఆధార్, రేషన్ కార్డుల వివరాలు కూడా సేకరిస్తున్నారు. ఖాళీ ఉన్న ఇళ్లలో వివరాలు నమోదు చేయడం లేదు. 2022- 23లో వాడిన విద్యుత్ వినియోగదారుల ప్రకారం అంచనా వేస్తున్నారు.

వినియోగదారులు సహకరించాలి

స్పాట్ విద్యుత్ బిల్లింగ్ కోసం వచ్చిన సిబ్బందికి వినియోగదారులు సహకరించాలి. వినియోగదారులు తమ రేషన్ కార్డు, ఆధార్ తోపాటు ఫోన్ నంబర్‌ను అందించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. మంగళవారం నుంచి జిల్లాలో ఈ ప్రక్రియను ప్రారంభించాం.

– వాసుదేవ్, ట్రాన్స్‌కో ఎస్ఈ

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

తిర్యాణి(ఆసిఫాబాద్): ఆదివాసీలు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. తిర్యాణి మండలం గడలపల్లి గ్రామంలోని పాములమడుగు పుణ్యక్షేత్రం వద్ద పాహండి కుపర్ లింగో జాతర సందర్భంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. విద్యతోనే ఆదివాసీల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని, బడీడు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపించాలని సూచించారు. పాములమడుగును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పీఎం జన్‌మన్ కార్యక్రమం ద్వారా పీవీటీజీల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం నిర్వాహకులు భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, డీఎస్పీ వెంకటరమణ, ఎస్సై రమేశ్, సింగరేణి బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్, జాతర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు మడావి గుణవంత్ రావు, నాయకులు సార రమేశ్ గౌడ్, వెడ్మ కమల, సిడాం అర్జు మాస్టార్, కుర్సెంగ మోతీరాం తదితరులు పాల్గొన్నారు.

నేడు నిర్మల్‌లో ఉమ్మడి జిల్లా సమావేశం

ఆసిఫాబాద్: నిర్మల్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 11 గంటలకు ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం- 2024పై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కుమురంభీం, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ఓటరు జాబితా పరిశీలకులు, ప్రభుత్వ సంస్థలు, శాఖల ప్రత్యేక కార్యదర్శి బి.భారతి లక్‌పతి నాయక్ హాజరవుతారని పేర్కొన్నారు. ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు, బూత్‌స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

శానిటేషన్ డ్రైవ్ పకడ్బందీగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



సోనాపూర్‌లో గిరిజన బాలికతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

రెబ్బెన(ఆసిఫాబాద్): గ్రామ పంచాయతీల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని గోలేటిలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను బుధవారం ప్రారంభించారు. అనంతరం పంచాయతీలోని పలు వార్డులను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పని చేస్తూ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో రోడ్లు, మురుగునీటి కాలువల పరిశుభ్రత, పిచ్చిమొక్కల తొలగింపు, ప్రతిరోజూ చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించాలని సూచించారు. పంచాయతీ పరిధిలో పన్నుల వసూలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో సిబ్బంది సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి జలందర్, ఎంపీటీసీలు సాగరమ్మ, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

లింబుగూడలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- పాఠశాలకు ఉపాధ్యాయుడు రాకపోవడంపై ఆగ్రహం
- కాంప్లెక్స్ హెచ్ఎం, సీఆర్పీలకు షోకాజ్ నోటీసులు
- లింబుగూడ, ఎనోలి కొలాంగూడ స్కూళ్లకు టీచర్ల కేటాయింపు



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

వాంకిడి(వాంకిడి): ట్రైబల్ వెల్ఫేర్ ప్రాథమిక పాఠశాల(టీడబ్ల్యూపీఎస్)లకు ఉపాధ్యాయులు హాజరు కాకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్న తీరుపై బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'గిరి బడులకు సార్లు దుమ్మా' అనే కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. వాంకిడి మండలంలోని లింబుగూడ గిరిజన ప్రాథమిక పాఠశాలను బుధవారం స్వయంగా కలెక్టర్ హేమంత్ బోర్కడే ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలకు ఉపాధ్యాయులు ఎప్పటి నుంచి రావడం లేదు.. లీవ్‌లో ఉన్నారా.. అనే విషయాలను డీటీడీవో రమాదేవిని అడిగి తెలుసుకున్నారు. బడికి టీచర్ రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనధికారికంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీ సమయంలో అందుబాటులో లేకపోవడం, పాఠశాలల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాని కారణంతో కాంప్లెక్స్ హెచ్ఎం(డీడీవో) శ్రీనివాస్, ఎస్సీఆర్పీ రాజేశ్వర్‌కు కలెక్టర్ ఆదేశాలతో షోకాజ్ నోటీసులు జారీ చేశామని డీటీడీవో రమాదేవి తెలిపారు. వివరణ తీసుకుని పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామన్నారు. లింబుగూడ, ఎనోలి కొలాంగూడ ప్రాథమిక పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించినట్లు తెలిపారు. అంతకు ముందు ఖిరిడి పాఠశాలను కలెక్టర్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. వారి వెంట తహసీల్దార్ రహీముద్దిన్ తదితరులు ఉన్నారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తూ బుధవారం బెల్లంపల్లి ఏరియాలోని గనులు, డిపార్టుమెంట్లలో ఐఎన్‌టీయూసీ నాయకులు, సింగరేణి ఉద్యోగులు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ మాట్లాడుతూ చెప్పుతో కొడతా అంటూ బాల్క సుమన్ మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఓటమిని జీర్ణించుకోలేక నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి మాదవ కృష్ణ, నాయకులు ప్రభాకర్, రమేశ్, భాస్కర్, వామన్‌కుమార్, తిరుపతి, శ్రీనివాస్, యాదగిరి, స్వామి, రవి, గట్టయ్య, సంతోష్, మహేందర్, సాయి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

'పారదర్శకత లేకుండా నియామకాలు'



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: జిల్లాలో గత నెలలో కాంట్రాక్టు పద్ధతిన చేపట్టిన పారామెడికల్ సిబ్బంది, డాక్టర్స్ ల్యాబ్ టెక్నీషియన్స్ నియామకాల్లో పారదర్శకత లోపించిందని డీవైఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో బుధవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారికి ఫిర్యాదు చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గొడిసెల కార్తీక్ మాట్లాడుతూ అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు పరిశీలించకుండానే ఫైనల్ నియామక పత్రాలిచ్చారని ఆరోపించారు. పూర్తిస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు రమేశ్, సరోజ, మౌనిక, మహేశ్వరి, ప్రమీల పాల్గొన్నారు.



రావుడ్ దేవతలకు మొక్కుతున్న భక్తులు



గుహలోని దీపానికి పూజలు చేస్తున్న భక్తురాలు



తిరుగు పయనమైన భక్తులు

ముగిసిన జంగుబాయి ఉత్సవాలు

- అమ్మవారిని దర్శించుకున్న 2.38లక్షల మంది భక్తులు
- 26రోజుల పాటు కొనసాగిన ప్రత్యేక పూజలు
- నేడు దేవతల శుద్ధీకరణ

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీల కొంగుబంగారంగా భావించే జంగుబాయి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. కెరమెరి మండలం మహరాజ్‌గూడ సమీపంలో కొలువైన జంగుబాయి అమ్మవారి క్షేత్రంలో జనవరి 14 నుంచి ప్రారంభమైన ఉత్సవాలు ఆద్యంతం వేడుకగా సాగాయి. తెలంగాణతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన ఆదివాసీలు రావి చెట్టు, పోచమ్మ, రావుడ్ దేవత, మైసమ్మ, గుహలోని దీపాన్ని దర్శించుకున్నారు. సుమారు 326 మేళంలు అమ్మవారిని దర్శించుకున్నాయి. చివరి రోజు భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మొత్తం 2.38లక్షల మందికి పైగా భక్తులు ఉత్సవాలకు హాజరైనట్లు ఆలయ కమిటీ సభ్యులు కొడప జాకు, మరప బాజీరావు వెల్లడించారు. ఉత్సవాలు ముగియడంతో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు కప్టి, సిద్దికస, దారికస, విజ్జకస, టొప్లకస ప్రాంతాల నుంచి తెచ్చిన పవిత్ర జలాలతో దేవతా విగ్రహాలను శుద్ధి చేయనున్నారు. శుక్రవారం నుంచి ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో ప్రారంభమయ్యే నాగోబా జాతరకు జంగుబాయి అమ్మవారు తరలివెళ్తారని ఆదివాసీలు నమ్ముతారు. దీంతో ఉత్సవాలు ముగిసినట్లు కటోదాలు ప్రకటించారు. జిల్లాలోని ఆదివాసీలు సైతం నాగోబా దర్శనానికి వెళ్లనున్నారు.

వాణి వినిపించాలి..
నిధులు తేవాలి

ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత తొలిసారి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు మొదటిసారి శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. గత ప్రభుత్వ హయాంలో మరుగున పడిన అనేక అభివృద్ధి పనులు, సాగునీటి ప్రాజెక్టులకు మోక్షం లభిస్తుందని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యేలు తమ వాణి వినిపించి ఉమ్మడి జిల్లాకు నిధుల తెచ్చేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.

'ప్రాణహిత'ను ప్రస్తావిస్తా



ఆసిఫాబాద్/కౌటాల: ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మాణం అంశాన్ని సభలో ప్రస్తావిస్తా. గతంలో పోడు భూముల విషయంలో నమోదైన కేసులు ఎత్తివేయాలని కోరుతా. కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం(పేపర్ మిల్లు)లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి. సిర్పూర్ నియోజకవర్గ సమస్యలను లేవనెత్తుతా.

– డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, సిర్పూర్ ఎమ్మెల్యే

గోదావరి జలాలు, మరుగుదొడ్ల సమస్యలు



బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో తాగునీటి కష్టాలు ఉన్నాయి. ప్రస్తుతం సరఫరా అవుతున్న అడ ప్రాజెక్టు నీటిని తాగేందుకు ప్రజలు ఇష్టపడటం లేదు. గోదావరి జలాలు సరఫరా చేయాలని కోరుతున్నారు. ఇదే అంశాన్ని అసెంబ్లీలో ప్రభుత్వం ముందుంచుతా. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలల సమస్యను పరిష్కరించేందుకు నిధులు కేటాయించాలని కోరుతా. ఈ రెండు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా.

– గడ్డం వినోద్, బెల్లంపల్లి ఎమ్మెల్యే

నాగోబా స్మరణలో 'మెస్రం'

- మర్రిచెట్టు వద్ద కొనసాగుతున్న పూజలు
- దేవుడు, వంశ చరిత్రను బోధిస్తున్న పెద్దలు
- కితల వారీగా సామూహిక వంటలు



తూమ్ పూజలకు నైవేద్యం తయారు చేసేందుకు బియ్యం సేకరిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: నాగోబా స్మరణలో మర్రిచెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని ఈ నెల 9న నిర్వహించే నాగోబా మహాపూజకు అవసరమయ్యే గంగాజలంతో వచ్చిన మెస్రం వంశీయులు కేస్లాపూర్ గ్రామ పొలిమేరలో పడియోర్ జన్మస్థలమైన మర్రిచెట్టు వద్ద బస చేశారు. ఉమ్మడి జిల్లా, మహారాష్ట్ర నుంచి మెస్రం వంశీయులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. రాత్రి ప్రదాన్ కితకు చెందిన మెస్రం పెద్దల ఆధ్వర్యంలో కిక్రి వాయిస్తూ నాగోబా చరిత్ర, 22 కితల మెస్రం వంశీయుల చరిత్రను బోధిస్తున్నారు. బుధవారం 22 కితల వారీగా జొన్నగట్కతో సంప్రదాయ వంటలు చేసి నైవేద్యం సమర్పించారు. జొన్నగట్కను ఉండలు చేసి కితలవారీగా పంపిణీ చేశారు. రాత్రి మెస్రం వంశంలోని 22 కితాల్లో మరణించిన పెద్దల పేరుతో తూమ్ (కర్మకాండ) పూజలు చేశారు. 9న జాతర ప్రారంభించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు.

తూమ్ పూజలు (కర్మకాండ)

మర్రిచెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులు బుధవారం రాత్రి తూమ్ పూజ (కర్మఖాండ) ఘనంగా నిర్వహించారు. 22 కితల మెస్రం వంశీయుల్లో మరణించిన పెద్దల పేర్లతో తూమ్ (కర్మకాండ)పూజలు చేశారు. తూమ్ పూజలతో వారు నాగోబా సన్నిధికి చేరినట్లు భావిస్తారు.



కష్టసుఖాలు పంచుకుంటున్న మెస్రం మహిళలు



వంటలు చేస్తున్న మెస్రం వంశ మహిళలు



ఎడ్లబండిపై వస్తున్న మెస్రం వంశీయులు

జొన్నగట్క ప్రత్యేకత



జొన్నగట్కతో తయారు చేస్తున్న ఉండలు

మెస్రం వంశీయుల సంప్రదాయ వంట జొన్నగట్కకు ప్రత్యేకత ఉంది. బియ్యం పాముగంగులో ఉండడం, పప్పు ధాన్యాలు పాము కళ్ల ఆకారంలో పోల్చి నాగోబా పూజల ప్రారంభం నుంచి ముగింపు వరకు ఇండ్ల నుండి తీసుకొచ్చిన జొన్నగట్క, పిండి పదార్థాలతో తయారుచేసిన చారు (కూర)ను కితల వారీగా వండి భోజనాలు చేస్తారు.

నాగోబా ఆలయానికి చేరిన కుండలు



ఆలయ ఆవరణలో కుండలు

నాగోబా మహాపూజ, సంప్రదాయ పూజలకు అవసరమయ్యే సిరికొండ మండల కేంద్రంలోని గుగ్గిల స్వామి తయారు చేసిన ఏడు రకాల 350 మట్టి కుండలు, మట్టి పాత్రలు బుధవారం నాగోబా ఆలయానికి చేరాయి. 20 పెద్ద బాణాలు, 55 కుండలు, 55 మూతలు, 45 కడుముంతలు, 150 దీపాంతలను నాగోబా ఆలయంలో భద్రపరిచారు.

పనితీరు మెరుగుపర్చుకోవాలి

రెబ్బెన: సింగరేణి సంస్థ పురోభివృద్ధి కోసం ఉద్యోగులంతా తమ పనితీరును మరింత మెరుగుపర్చుకోవాలని ఎస్వోటూ జీఎం మచ్చగిరి నరేందర్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి ఏరియా లోని గోలేటి సీహెచ్‌పీలో మల్టీ డిపార్టుమెంటల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షిఫ్టుల వారీగా ఉద్యోగులకు సంస్థ సాధించిన ప్రగతితో పాటు భవిష్యత్ కార్యాచరణను వివరించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహెరా, డీజీఎం ఎఫ్అండ్ఏ రామారావు, పర్సనల్ మేనేజర్ తిరుపతి పాల్గొన్నారు.

ఇసుక డంప్‌లు సీజ్

భీమారం: మండలంలోని ఎలకేశ్వరం రహదారి పక్కన చేనులో నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను బుధవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా 15 ట్రాక్టర్ల ఇసుక నిల్వ ఉంచారని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ స్రవంతి తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్ విజయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాలపై అవగాహన

జన్నారం: ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలపై 10వ ఎన్‌డీఆర్ఎఫ్ బృందం బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అవగాహన కల్పించారు. అనుకోకుండా, ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడే ప్రమాదాల నుంచి తప్పించుకునే విధానంపై అవగాహన ఉంటే ప్రాణాలు కాపాడుకోవచ్చని 10వ ఎన్‌డీఆర్ఎఫ్ బెటాలియన్ సీఐ బిటెన్ తెలిపారు. గుండెపోటు వస్తే సీపీఆర్ చేసే విధానం, అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి అనే అంశాలపై ప్రత్యక్షంగా తెలియజేశారు. ఎంపీడీవో అరుణరాణి, ఆర్ఐ భానుచందర్ పాల్గొన్నారు.

బకాయిల చెల్లింపునకు హామీ

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



సమావేశంలో పాల్గొన్న సత్తయ్య

శ్రీరాంపూర్: 11వ వేతన ఒప్పంద పరిధిలో రిటైర్డ్ కార్మికులకు సంబంధించిన బకాయిలు వెంటనే చెల్లించడానికి కోలిండియా యాజమాన్యం హామీ ఇచ్చిందని బీఎంఎస్ అధ్యక్షుడు, స్టాండర్డ్‌డైజేషన్ సభ్యులు యాదిగిరి సత్తయ్య తెలిపారు. బుధవారం రాజస్థాన్‌లోని జైసాల్మర్‌లో జరిగిన జేబీసీసీఐ-11, 2వ స్టాండర్డ్‌డైజేషన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అందులో అన్ని క్యాడర్‌స్కేలపై చర్చించామని, రాబోయే సమావేశాల్లో వీటీపీఐ నిర్ణయం తీసుకోవడానికి యాజమాన్యం అంగీకరించిందన్నారు. బొగ్గు పరిశ్రమల్లో పని చేసే కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు, వార్షిక బోనస్, పీఎల్ఆర్ చెల్లింపులకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవడానికి అంగీకారం కుదిరిందన్నారు. బొగ్గు పరిశ్రమల్లో బదిలీ వర్కర్ డిజిగ్నేషన్‌ను రద్దు చేసి దాని స్థానంలో గౌరవ ప్రదమైన డిజిగ్నేషన్ ఇవ్వాలని డిమాండ్ చేయగా తదుపరి సమావేశాల్లో నిర్ణయం తీసుకుంటామన్నారన్నారు. ఇంకా పలు అంశాలపై చర్చించడం జరిగిందన్నారు.

కొత్త గనుల ఏర్పాటుకు కృషి చేయాలి



మల్లు రవికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణిలో కొత్త గనుల ఏర్పాటుకు అవసరమైన కేంద్ర ప్రభుత్వ అనుమతులు త్వరగా వచ్చేలా కృషి చేయాలని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కాంగ్రెస్ అధికార ప్రతినిధి మల్లు రవిని కోరారు. బుధవారం ఢిల్లీకి వెళ్లి ఆయన నివాసంలో కలిసి సింగరేణి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కొత్తగూడెం వీకే 7 ఓసీపీ, ఇల్లందులో రొంపేడు ఓసీపీలకు ఫారెస్ట్ క్లియరెన్స్ త్వరగా వచ్చేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎంవీ రావు, కోశాధికారి జిమ్మిడి మల్లేశ్, నాయకులు కాసిపేట కృష్ణ, డేగల ప్రవీణ్ కుమార్ శని గారపు కుమారస్వామి, బూర్గుల రామారావు, నక్క సుమన్, శ్రీనాథ్ పాక రవి పాల్గొన్నారు.

దొంగను బెదిరించి దోచుకున్న ఆటోడ్రైవర్

- పోలీసుల అదుపులో నిందితులు

మంచిర్యాలక్రైం: దోచుకున్న సొమ్ము, నగదుతో ఆటోలో పారిపోతున్న ఓ దొంగను కొందరు ఆటోడ్రైవర్లు బెదిరించి దోచుకున్న ఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని రాజురకు చెందిన కాకట్ల కేశవరెడ్డి ఈ నెల 6న శ్రీరాంపూర్ వాటర్ ట్యాంక్ ఏరియాకు చెందిన మంద భాస్కర్ ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. దోచుకున్న రూ.లక్షకు పైగా నగదుతో బుధవారం శ్రీరాంపూర్ నుంచి ఆటోలో మంచిర్యాలకు వెళ్తుండగా అదే ఆటో డ్రైవర్‌తో పాటు మరికొందరు కేశవరెడ్డిని బెదిరించి అతని బ్యాగును తనిఖీ చేయగా అందులో రూ.51 వేల నగదు లభించింది. ఇంత డబ్బు ఎక్కడిదని అందులోంచి రూ.31వెయ్యి నగదు శేఖర్ తీసుకున్నాడు. ఈ క్రమంలో కేశవరెడ్డి, శేఖర్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మిగతా వ్యక్తులు 100కు డయల్ చేసి సమాచారం అందించారు. పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన ఎస్సై విచారణ జరుపుతున్నారు.

ఉత్పత్తి, ఉత్పాదకత పెంచాలి

శ్రీరాంపూర్: ప్రస్తుత పరిస్థితిలో సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకత మరింత పెరగాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ బీ సంజీవరెడ్డి అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిపై నిర్వహించిన మల్టీ డిపార్టుమెంటల్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి సంస్థ ఆర్థికంగా పరిపుష్టి సాధించాలంటే కొత్త ప్రణాళికలను సిద్ధం చేసుకుని దానికి అనుగుణంగా ముందుకెళ్లాలన్నారు. సంస్థ ముందు అనేక సవాళ్లు ఉన్నాయని దీనికోసం ఉత్పత్తిని, ఉత్పాదకతను బొగ్గు నాణ్యత ప్రమాణాలను పెంపొందించుకోవడం ముఖ్యమన్నారు. సమావేశంలో ఎస్వోటూ జీఎం రఘుకుమార్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజీఎం మురళీధర్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి పురుషోత్తంరెడ్డి, మేనేజర్ సుధీర్ జక్కుల వార్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి



మాట్లాడుతున్న జీఎం మనోహర్

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 2గనిపై బుధవారం మల్టీ డిపార్టుమెంటల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఏరియా జీఎం మనోహర్ మాట్లాడుతూ కంపెనీ ఉత్పత్తి, ఉత్పాదకత, లక్ష్యాలు, సాధించిన విజయాలు, ఓసీలు, భూగర్భ గనుల్లో యంత్రాల వినియోగం గురించి కార్మికులకు వివరించారు. ప్రతీ ఉద్యోగి తమకు కేటాయించిన పనులు నిబద్ధతతో చేసినట్లయితే సంస్థ అన్నిరంగాల్లో ముందుంటుందన్నారు. అనంతరం కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ ఎస్వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, కేకే గ్రూప్ ఏజెంట్ రాందాస్, సీఎంవోఏఐ అధ్యక్షుడు పైడీశ్వర్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, ఐఈడీ రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ గాడిన పడేనా..?

- దృష్టి సారిస్తున్న ప్రజాప్రతినిధులు
- విద్యార్థుల్లో పెరుగుతున్న ధైర్యం



బాసర ట్రిపుల్‌ఐటీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్ (ఫైల్)

భైంసా(ముధోల్): బాసర ట్రిపుల్‌ఐటీలో నెలకొన్న సమస్యలపై ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తున్నారు. సోమవారం ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ట్రిపుల్‌ఐటీకి వెళ్లి పరిశీలించారు. విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు అధైర్యపడవద్దని.. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఉండే వసతిగృహాలు, మరుగుదొడ్లు, స్నానపు గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

పెరుగుతున్న ధైర్యం...

ట్రిపుల్‌ఐటీలో కొన్నేళ్లుగా పాతుకుపోయిన కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మెస్‌లలో పురుగుల అన్నం పెట్టే పరిస్థితిని మార్చాలని విద్యార్థులు ఎమ్మెల్యేను కోరారు. బాసర ట్రిపుల్‌ఐటీ అధికారులు పెడుతున్న ఆంక్షలు గోప్యత కారణంగా ఏం జరుగుతుందో తెలియక విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ట్రిపుల్‌ఐటీలో జరుగుతున్న అక్రమాలపై అవసరమైతే విజిలెన్స్‌తో విచారణ చేయిస్తానని ఎమ్మెల్యే రామారావుపటేల్ హామీ ఇచ్చారు. విద్య, వైద్యంపై తాను రాజీపడనన్నారు. ఎమ్మెల్యే పర్యటనతో ట్రిపుల్‌ఐటీ మెస్‌ల నిర్వాహణపైన క్యాంపస్ అధికారులు దృష్టి సారించారు.

16 ఏళ్లుగా నిరీక్షణ...

ఉమ్మడి రాష్ట్రంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో బాసర, ఇడుపులపాయ, నూజివీడులలో ట్రిపుల్‌ఐటీలను ప్రారంభించారు. రాష్ట్ర విభజన అనంతరం మన రాష్ట్రానికి బాసర ట్రిపుల్‌ఐటీ ఒక్కటే మిగిలింది. ట్రిపుల్‌ఐటీ ప్రారంభంలో 129 మంది కాంట్రాక్టు అధ్యాపకులు, 19 మంది పర్మినెంట్ ప్రొఫెసర్లను ప్రభుత్వం నియమించింది. 16 ఏళ్లుగా వారే పనిచేస్తున్నారు. మరో 70 మంది అధ్యాపకులను గెస్ట్ ఫ్యాకల్టీగా తాత్కాలికంగా నియమించుకున్నారు. మరో 125 మంది ప్రొఫెసర్లు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం 2014లో సూచించింది. ఇప్పటికీ ఈ పోస్టుల భర్తీ జరుగలేదు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించింది. కానీ యూనివర్సిటీ ఏర్పడినప్పటి నుంచి పనిచేస్తున్న ట్రిపుల్‌ఐటీ కాంట్రాక్టు ఉద్యోగులు క్రమబద్ధీకరణకు నోచుకోవడంలేదు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో ప్రత్యామ్నాయ అవకాశాలు వస్తే ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లి పోతున్నారు. 19 మంది పర్మినెంట్ ప్రొఫెసర్లు ఉంటే ఉన్నత చదువుల పేరిట 12 మంది సెలవులో వెళ్లారు. తాత్కాలిక అధ్యాపకులను నియమించుకుని విద్యాసంవత్సరం వెళ్లదీస్తున్నారు. ఒక వైపు విద్యాబోధన మరోవైపు అదనపు బాధ్యతలతో తీవ్ర పనిఒత్తిడికి గురవుతున్నారు. ఎక్కడ లోపం జరిగినా క్రమశిక్షణ చర్యలకు బాధ్యులవుతామనే భయం ఉద్యోగులను వెంటాడుతోంది. డీన్‌లు, హెడ్ ఆఫ్‌ద డిపార్ట్‌మెంట్, ఎగ్జామినర్, చీఫ్ వార్డెన్, వార్డెన్, స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ వంటి కీలకమైన బాధ్యతలను అధ్యాపకులకు అప్పజెప్పున్నారు. ట్రిపుల్‌ఐటీలో టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. క్రమబద్ధీకరణతోపాటు నిబంధనల ప్రకారం వేతనాల పెంపు, ఇతర భత్యాల కోసం ఈ ఉద్యోగులంతా మూడు నెలలకోసారి పోరాటం చేస్తున్నారు.

వసతులు అంతంతే...

ట్రిపుల్‌ఐటీలో వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మరుగుదొడ్ల నిర్వాహణ సరిగాలేదు.నిబంధనల పేరిట అధికారులు ఎవరినీ అనుమతించడంలేదు. క్యాంపస్‌లో ఏంజరిగినా బయటకు పొక్కనివ్వడంలేదు. మెస్‌లలో పురుగుల అన్నం వచ్చినా విద్యార్థులు అలాగే భోజనాలు చేస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బందికి తోడు కొంత మంది రిటైర్డ్ ఆర్మీ అధికారులను నియమించుకుని పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. విద్యార్థులు తరగతి గదిలో లేదంటే భోజన శాలకు అక్కడి నుంచి నేరుగా హాస్టల్ గదుల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. నలుగురు కలిసి మాట్లాడినా విచారణ ఎదుర్కొవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థుల ఫోన్‌లు తీసుకుని తనిఖీలు కూడా చేస్తున్నారు. చిన్న చిన్న తప్పిదాలకు సంజాయిషి లెటర్‌లు రాయించుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితులు విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రెండు, మూడేళ్లుగా ట్రిపుల్‌ఐటీ సమస్యలపై ఆందోళనలు చేసిన విద్యార్థులపై సైతం నిఘా ఉంచినట్లు సమాచారం.

సమస్యలు నా దృష్టికి తీసుకురండి

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఏ సమస్య ఉన్నా నన్ను సంప్రదించవచ్చు. విద్యార్థుల ఇబ్బందులు ధైర్యంగా తెలియజేయవచ్చు. విద్య, వైద్యం విషయంలో రాజీపడలేం. ట్రిపుల్‌ఐటీలో అక్రమాలపై అవసరమైతే విజిలెన్స్ విచారణ చేయిస్తాం. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే మా లక్ష్యం.

– రామారావుపటేల్, ఎమ్మెల్యే, ముధోల్

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

బెల్లంపల్లి: రైలు కిందపడి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కె.సురేష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.... బెల్లంపల్లి మున్సిపాలిటీ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన కదాసి సత్యనారాయణ (51) రైస్ మిల్లు ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. కుటుంబంలో కలహాలు చోటు చేసుకోవడంతో మనస్తాపం చెంది బుధవారం కన్నాల రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కిందకు వెళ్లి ఓ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహానికి పంచనామా నిర్వహించి అతని భార్య మల్లేశ్వరికి అప్పగించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

జాతరకు వెళ్లి శవమై వచ్చాడు

- నీటిలో మునిగి యువకుడు మృతి



స్వాగత్ (ఫైల్)

మందమర్రిరూరల్: కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా మేడారం జాతరకు వెళ్లిన స్వాగత్ శవమై ఇంటికి రావడంతో పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మందమర్రి పట్టణంలోని దీపక్‌నగర్‌కు చెందిన లక్ష్మణ్, వాణి దంపతుల కుమారుడు స్వాగత్(25) సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి మేడారం వెళ్లాడు. మొక్కులు తీర్చుకున్న అనంతరం మంగళవారం జంపన్నవాగు సమీపంలో బస చేశారు. బంధువుల పిల్లలతో కలిసి స్వాగత్ అక్కడే ఉన్న నీటిలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. నీటిలోకి దిగి బయటకు రాకపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేశారు. రెస్క్యూ టీం వెతుకగా బుధవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. మృతదేహానికి ములుగు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పందెంరాయుళ్ల అరెస్ట్



పందెం రాయుళ్లతో టాస్క్‌ఫోర్స్ అధికారులు

బెజ్జూర్: మండలంలోని సలుగుపల్లి శివారులో కోడిపందేలు ఆడతున్న వారిని టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్ట్ చేశారు. ఎస్పీ కే సురేష్ కుమార్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, ఎస్సై సందీప్ కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి పదిహేను మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.41,740 నగదుతో పాటు నాలుగు పందెం కోళ్లు, 11 ఫోన్లు, పది కత్తులు, 5 బైకులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. దాడుల్లో పీసీలు మధు, రమేశ్, సంజీవ్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.